


కలల వారధి సాకారం

వశిష్ట గోదావరిపై నరసాపురంలో వంతెన నిర్మాణ కల త్వరలో సాకారం కానుంది. పనులకు టెండర్లను జూన్‌లో తెరవనున్నారు. 8లో ▸



వలసల జోరు

ఎన్నికల సమీపిస్తున్న కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸



ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు

రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన సోమవరప్పాడులో చోటుచేసుకుంది. 8లో ▸

తుది జాబితా రెడీ

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- ఏలూరు జిల్లాలో 99 మంది..
- పశ్చిమగోదావరి జిల్లాలో 110 మంది పోటీలో..
- ప్రధాన పార్టీలతో పాటు ప్రతిచోటా స్వతంత్రులు
- ఇండిపెండెంట్లకు గుర్తుల కేటాయింపు పూర్తి
- ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వీరే..



కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఏలూరు ఎంపీ అభ్యర్థి | ఆళ్ల నాని, ఏలూరు | తానేటి వనిత, గోపాలపురం | పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు



కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు | మేకా వెంకట ప్రతాప అప్పారావు, నూజివీడు | దూలం నాగేశ్వర రావు, కైకలూరు | తెల్లం రాజ్యలక్ష్మి, పోలవరం | కంభం విజయరాజు, చింతలపూడి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ కీలక ఘట్టానికి చేరుకుంది. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ పూర్తి చేసి బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను, ఎన్నికల గుర్తులను రిటర్నింగ్ అధికారులు సోమవారం కేటాయించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు బరిలో నిలిచారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి 13 మంది, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి 21 మంది బరిలో ఉండగా ఏలూరు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 86 మంది, పశ్చిమగోదావరి జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాల నుంచి 89 మంది పోటీలో ఉన్నారు.

నేడు అభ్యర్థులతో సమావేశం

ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులకు అధికారులు ఎన్నికల గుర్తులు కేటాయించారు. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ, రెండు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించారు. 26న నామినేషన్ల పరిశీలన నిర్వహించి సోమవారం వరకు ఉపసంహరణకు తుది గడువు ఇచ్చారు. సాయంత్రం 3 గంటల తర్వాత రెండు పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థులు గుర్తులు కేటాయింపు పూర్తి చేశారు. అలాగే మంగళవారం ఉదయం 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సాయంత్రం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులతో కలెక్టర్లు సమావేశం నిర్వహించి ఎన్నికల నియామవళిని వివరించనున్నారు.

ప్రచార పర్వంలో వైఎస్సార్‌సీపీ ముందంజ

అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎన్నికల క్షేత్రంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నుంచి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గూడూరి ఉమాబాల బరిలో నిలిచారు. ఏలూరు జిల్లాలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల నాని, గోపాలపురం నియోజకవర్గం నుంచి హోం మంత్రి తానేటి వనిత, ఉంగుటూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, కైకలూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, నూజివీడులో సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు, దెందులూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, చింతలపూడిలో కంభం విజయరాజు, పోలవరంలో తెల్లం రాజ్యలక్ష్మి భారీ ర్యాలీగా నామినేషన్లు దాఖలు చేసి ప్రచార పర్వంలో దూసుకు వెళుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, తణుకు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి కారుమూరి నాగేశ్వర రావు, ఆచంట నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, నరసాపురం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, భీమవరం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ గ్రంధి శ్రీనివాస్, పాలకొల్లు నుంచి గుడాల గోపి, ఉండి నుంచి పీవీఎల్ నర్సింహరాజు ప్రచార పర్వంలో ముందంజలో ఉన్నారు.

ఏలూరు జిల్లా..

- ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి 17 నామినేషన్లు దాఖలు కాగా 4 డమ్మీ నామినేషన్లను తిరస్కరించడంతో 13 మంది బరిలో నిలిచారు.
- ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 16 నామినేషన్లు స్వీకరించగా ఒకటి తిరస్కరణకు గురి కాగా, ముగ్గురు ఉపసంహరించుకున్నారు. దీంతో 12 మంది ఎన్నికల బరిలో ఉన్నారు.
- దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 18 నామినేషన్లకుగాను 3 నామినేషన్లు తిరస్కరణకు గురికావడంతో 15 మంది బరిలో నిలిచారు.
- ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 16 నామినేషన్లకు గాను ఒకటి తిరస్కరణ, మరొకటి ఉపసంహరణతో 14 మంది ఎన్నికల బరిలో ఉన్నారు.
- పోలవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అత్యధికంగా 23 నామినేషన్లకుగాను 10 తిరస్కరణ, ఒకటి ఉపసంహరణ కాగా, 12 మంది పోటీలో ఉన్నారు.
- చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 13 నామినేషన్లకుగాను 3 తిరస్కరణ, ఒకటి ఉపసంహరణతో 8 మంది పోటీలో ఉన్నారు.
- నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 15 నామినేషన్లకుగాను 3 తిరస్కరణ, 2 ఉపసంహరణతో 10 మంది బరిలో ఉన్నారు.
- కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అత్యధికంగా 23 నామినేషన్లకుగాను 5 తిరస్కరణ, 3 ఉపసంహరణతో 15 మంది పోటీలో ఉన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా

- నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 27 మంది అభ్యర్థులు 39 సెట్లు దాఖలు చేయగా పరిశీలన అనంతరం ఆరుగురు అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణతో 21 మంది బరిలో నిలిచారు.
- ఆచంట అసెంబ్లీ నియోజకవర్గంలో 11 మందికిగాను ఇద్దరు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 9 మంది పోటీలో ఉన్నారు.
- పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గంలో 16 నామినేషన్లకుగాను ఒకరు ఉపసంహరించుకోవడంతో 15 మంది పోటీలో ఉన్నారు.
- నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 12 నామినేషన్లకుగాను ఒకరు ఉపసంహరించుకోవడంతో 11 మంది పోటీలో ఉన్నారు.
- భీమవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 17 నామినేషన్లకుగాను ఇద్దరు ఉపసంహరించుకోవడంతో 15 మంది పోటీలో ఉన్నారు.
- ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలో 17 నామినేషన్లకు గాను 4 ఉపసంహరించుకోవడంతో 13 మంది బరిలో ఉన్నారు.
- తణుకు అసెంబ్లీ నియోజకవర్గంలో 13 నామినేషన్లకుగాను 13 మంది పోటీలో నిలిచారు.
- తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గంలో 13 నామినేషన్లకుగాను 13 మంది ఎన్నికల పోటీలో ఉన్నారు.

బరిలో నిలిచిన అభ్యర్థులు	
ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం	13 మంది
నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం	21 మంది
ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు	86 మంది
పశ్చిమగోదావరిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు	89 మంది

న్యూస్‌రీల్

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి



ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): సాధారణ ఎన్నికల పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తిచేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్, ఎస్‌పి రామన్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లా పరిధిలోని 1,751 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయించామన్నారు. 1,926 ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 1,926 అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 6,689 ఇతర సిబ్బంది కలిపి మొత్తం 10,541 మందిని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించామని అన్నారు. ఎన్నికల విధులపై వీరికి త్వరలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియలో పోలింగ్ సిబ్బందిని బూత్‌ల వారీగా కేటాయిస్తామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ డి.పుష్పమణి, డీఈఓ ఎస్.అబ్రహం, ఎన్‌ఐసీ అధికారి శర్మ, కలెక్టరేట్ ఏఓ కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

బాలలతో భిక్షాటన నేరం



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీఓ

ఏలూరు (టూటౌన్): బాలలతో భిక్షాటన చేయిస్తే వారి తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా బాలల సంరక్షణాధికారి డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి అన్నారు. స్థానిక కొత్త బస్టాండ్‌లో బాలలతో భిక్షాటన చేయిస్తున్న ఇద్దరు తల్లులు, ఇద్దరు బాలలను డీసీపీఓ, చైల్డ్‌లైన్ బృందాలు గుర్తించి వారి వివరాలు సేకరించారు. బాలలతో భిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరం అని అలాగే బాలల విద్య వలన కలిగే ప్రయోజనాలను గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాలలతో భిక్షాటన చేయిస్తే వెంటనే చైల్డ్‌లైన్–1098కి సమాచారం ఇవ్వాలని డాక్టర్ సూర్యచక్రవేణి సూచించారు. చైల్డ్‌లైన్ సిబ్బంది ఎం.రాజేష్, రాజకుమార్ పాల్గొన్నారు.

గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం


తల్లీబిడ్డకు గాయాలు



గాయాలతో ఝాన్సీలక్ష్మి, చిన్నారి సాన్విక

ఏలూరు టౌన్: నగరంలోని చాణక్యపురి కాలనీ రెండో రోడ్డులో ఓ ఇంట్లో గ్యాస్ లీకైన కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో తల్లీబిడ్డకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కన్నెపు ఝాన్సీలక్ష్మికి చెందిన ఇంట్లో వంటగదిలో సోమవారం సాయంత్రం గ్యాస్ లీకై ఇల్లంతా వ్యాపించింది. ఇది గమనించని లక్ష్మి వంట చేసేందుకు స్టౌ వెలిగించేందుకు వెళ్లగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న ఫ్రిడ్జ్‌కు మంటలు వ్యాపించి కంప్రెషర్ పేలింది. ఈ ప్రమాదంలో లక్ష్మి, సాన్వికకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. గాయాలైన తల్లీబిడ్డలను ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

నేటినుంచి శ్రీనివాసుని కల్యాణోత్సవాలు



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న దత్తత ఆలయం లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజు స్వామివారి పెండ్లి ముస్తాబు, 1న ధ్వజారోహణ, 2న ఎదుర్కోలు ఉత్సవం, 3న రాత్రి 7 గంటలకు తిరు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. 4న తిమ్మాపురంలో గరుడోత్సవం, 5న శ్రీ చక్రవార్యుత్సవం, ధ్వజావరోహణ, 6న రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయన్నారు.

కూరలో కరివేపాకులా కమలం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి నేతల్లో కుంపట్లు కొనసాగుతూనే ఉన్నాయి. పొత్తులు ఇష్టపడని నాయకులు అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి కూటమి అభ్యర్థికి తలనొప్పిగా మారింది. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం సీటును బీజేపీ ఆశించింది. ఆ పార్టీ నేత గారపాటి సీతారామంజేయచౌదరి ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే పొత్తుల్లో భాగంగా ఈ సీటును టీడీపీ తన్నుకుపోయింది. దీంతో బీజేపీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత దెందులూరు అసెంబ్లీ సీటు కోసం ప్రయత్నించినా చంద్రబాబు మార్కు రాజకీయంతో అదీ దక్కలేదు. ఈ నేపథ్యంలో బీజేపీ శ్రేణులు తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితి కొనసాగుతుండగా తాజాగా ఏలూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బడేటి చంటి వ్యవహారం బీజేపీ శ్రేణులకు మింగుడుపడటం లేదు. చంటి ప్రచార కరపత్రాలు, ప్రకటనల్లో కనీసం బీజేపీ ఊసు ఎత్తకపోవడం ఆగ్రహం కలిగిస్తోంది. కేవలం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఫొటోలతో కరపత్రాలు, ప్రకటనలు, టేబుల్ క్యాలెండర్లు వంటివి రూపొందించడాన్ని సహించలేకపోతున్నారు. కనీసం మోదీ ఫొటో కానీ, పురందేశ్వరి ఫొటో గాని పేరు గాని చంటి ప్రచారంలో కనిపించకపోవడంతో టీడీపీ నాయకులు బీజేపీని కూరలో కరవేపాకులా చూస్తున్నారని పలువురు గుసగుసలాడుకుంటున్నారు.



బీజేపీ ఊసే లేని టీడీపీ ప్రచార కరపత్రం

ఘనంగా చండీ హోమం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ కార్యదర్శి మాడ రామ్మోహనరావు మాట్లాడుతూ ఆలయంలో ప్రతి నెలా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని చండీ హోమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన సత్యకిరణ్ పురోహితులు ఉభయులుగా వ్యవహరించి హోమం నిర్వహించారన్నారు.

కోవిడ్ సమయంలో కామినేని ఎక్కడున్నారు?

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: కోవిడ్ సమయంలో కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ఎక్కడున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ప్రశ్నించారు. సోమవారం స్థానిక సీతారామ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ స్థాయి నాయకులు, యువజనులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలిసి ఆయన పార్టీ కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా తాలూకా సెంటర్ వరకు వచ్చారు. ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో విజయానికి కార్యకర్తల కష్టమే కారణమవుతోందన్నారు. పెత్తందారీ వర్గానికి చెందిన కామినేని ఐదేళ్లలో నియోజకవర్గంలో కనిపించలేదన్నారు. కోవిడ్‌లో గుర్తుకురాని ప్రజలు ఎన్నికల్లో గుర్తుకు వచ్చారా అని మండిపడ్డారు. ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో 5వ ప్యాకేజీ కింద లెఫ్ట్ కెనాల్ పనులు చేసిన కాంట్రాక్టర్ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ ఇప్పుడు టీడీపీ ఎంపీగా పోటీ చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ చంద్రబాబు పోలవరాన్ని ఏటీఎంగా వాడుతున్నారని అన్నారని.. చంద్రబాబుతో పాటు పుట్టా కూడా కారణమన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యే డీఎన్నార్‌ను, ఎంపీగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ మంత్రిగా ఉన్నప్పుడు కొల్లేరు ఫైల్ ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీవీ రావు మాట్లాడుతూ కామినేని చివరకు చిరంజీవిని బతిమిలాడి సపోర్టుగా వీడియోను విడుదల చేయించుకున్నారని ఎద్దేవా చేశారు. గౌడ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోసిన చెంచురామారావు, చిట్టూరి మురళీకృష్ణ, ఈడే వెంకటేశ్వరరావు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్ గంటా సంధ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, కైకలూరు, కలిదిండి ఏఎంసీ చైర్మన్లు చేబోయిన వీరరాజు, కొల్లాటి సత్యనారాయణ, నిమ్మగడ్డ భిక్షాలు, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కైకలూరులో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్, ఎమ్మెల్సీ జయమంగళను ఆహ్వానిస్తున్న యువకులు

బ్యాంకు ఖాతాలకే పెన్షన్లు

- సచివాలయాలకు ఎవరూ రానవసరం లేదు
- జిల్లాలో 77.50 శాతం పెన్షన్లు ఖాతాల్లో జమ
- మిగిలిన వారి ఇళ్లకు వెళ్లి పంపిణీ
- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



సాక్షి ప్రతినిధి, ఏలూరు: సామాజిక పెన్షన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షనర్ల బ్యాంకు ఖాతాలకే నగదు జమ చేస్తున్నామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సచివాలయాలకు ఎవరూ రానవసరం లేదని, కొన్ని కేటగిరీ వ్యక్తులకు గత నెలలో ఇచ్చిన మాదిరిగా ఇంటికి వెళ్లి సచివాలయ సిబ్బందికి అందజేస్తారని, మిగిలిన వారందరికీ బ్యాంకు ఖాతాల్లోనే జమవుతాయని అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 2,69,886 మంది పెన్షనర్లు ఉన్నారని, వీరికి రూ.80.63 కోట్ల మొత్తాన్ని రెండు విధానాల ద్వారా పంపిణీ చేస్తున్నామని వివరించారు. పింఛన్‌దారుడు ఆధార్ కార్డుకు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు నేరుగా నగదు జమవుతుందని, ఇలా జిల్లాలో 77.5 శాతం అంటే 2,05,548 మందికి రూ.61.67 కోట్లు జమచేస్తామని తెలిపారు. మెసేజ్‌లు, ఫోన్‌పే, గూగుల్ పే ఇతర యాప్‌ల ద్వారా బ్యాంకు నిల్వలను చెక్ చేసుకోవాలని సూచించారు.

64,338 మంది ఇళ్లకు వెళ్లి..

జిల్లాలో 22.50 శాతం మందికి అంటే 64,338 మందికి రూ.18.96 కోట్ల నగదును సచివాలయ సిబ్బంది నేరుగా ఇళ్లకు వెళ్లి 1,2 తేదీల్లో అందజేస్తారని, 2వ తేదీ సాయంత్రానికి 90 శాతానికిపైగా పంపిణీ పూర్తి చేస్తామని ప్రభుత్వ మార్గదర్శకాల్లో 5వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. దివ్యాంగులు, తీవ్రమైన వ్యాధులు, మంచానికే పరిమితమైన పెన్షన్‌దారులు, యుద్ధ సైనిక వితంతు కుటుంబాలకు ఇళ్లకు వెళ్లి అందిస్తామన్నారు. అలాగే బ్యాంకు నగదు జమకు సంబంధించి సచివాలయాల్లో డిస్‌ప్లే చేయడంతో పాటు సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షనర్లకు తెలియచేసే కార్యక్రమం నిర్వహిస్తామని సూచించారు. ఈ కారణంగా ఏ ఒక్క పెన్షనర్ సచివాలయానికి రానవసరం లేదని చెప్పారు. బ్యాంకు ఖాతాల్లో జమ చేసి రిజెక్ట్ అయిన వారు, ఈకేవైసీ లేకపోవడం, ఇతర కారణాలతో రానివారికి వారి సచివాలయ సిబ్బందే ఇంటికి వచ్చి నగదు అందజేస్తారని, ఎన్నికల ప్రవర్తనా నియామవళికి కట్టుబడి పెన్షన్ పంపిణీ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు సచివాలయాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. 1వ తేదీన 77.50 శాతం బ్యాంకు ఖాతాలకు జమ పూర్తి చేసుకుని మిగిలిన 22.50 శాతం పంపిణీ ఇళ్ల వద్దే ప్రారంభమవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లాస్థాయి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

ఏలూరు(మెట్రో): పెన్షన్ల పంపిణీ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ కార్యాలయంలో జిల్లాస్థాయి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తెలిపారు. హెల్ప్ డెస్క్‌లో అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ఎస్‌వీఎస్ భరద్వాజ్ 9347448557, జూనియర్ అసిస్టెంట్ వి.సత్యనారాయణ 6303512672 అందుబాటులో ఉంటారన్నారు. పెన్షన్లకు సంబంధించి సమాచారం కోసం హెల్ప్‌డెస్క్ పనిచేస్తుందన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 18,465

- జిల్లాలో హోమ్ ఓటర్లు 915 మంది..
- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సాక్షి ప్రతినిధి,ఏలూరు: జిల్లాలో 18,465 మందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో 12,485 మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో, 2,134 మంది అత్యవసర విధుల్లో ఉన్నారని, అలాగే ఏలూరు జిల్లాలో ఓటు హక్కు కలిగి ఉండి, ఇతర జిల్లాల్లో 3,239 మంది పనిచేస్తున్నారని, వీరందరికీ పోస్టల్ బ్యాలెట్ జారీ చేస్తున్నామని వివరించారు. మే 4, 5 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటైజేషన్ కేంద్రాల ద్వారా వీరందరూ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అలాగే జిల్లాలో 4,500 మంది హోమ్ ఓటర్లను గుర్తించగా వారిలో 917 మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు అందజేశారని, దానికి కూడా పూర్తిగా కదలలేని స్థితిలో, విభిన్నప్రతిభావంతులు ఉన్నారని వారి ఇళ్లకు వెళ్లి హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ మొత్తం రికార్డు చేస్తారని, ఓటింగ్ విధానం రహస్యంగా ఉంటుందన్నారు.

ఒక ఈవీఎం యూనిట్‌తోనే..

జిల్లాలో ఎన్నికల పరిశీలకుల సమక్షంలో రెండో విడత రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని, అన్ని నియోజకవర్గాల్లో 15 మంది అభ్యర్థులు ఉన్న కారణంగా ఒక ఈవీఎం యూనిట్ సరిపోతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రూ.14.09 కోట్ల విలువైన సొత్తును సీజ్ చేశామని, దీనిలో రూ.2.20 కోట్ల నగదు, రూ.1.63 కోట్ల విలువైన మద్యం, రూ.10.30 కోట్ల బంగారం, ఇతర వస్తువులను సీజ్ చేశామని, అన్ని రాజకీయ పార్టీలకు కలిపి 2,343 అనుమతులు మంజూరు చేశామని, సీ–విజిల్ ద్వారా వచ్చిన 429 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు.

అభ్యర్థుల నేర చరిత్ర తెలియజేయాలి

పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న వారికి సంబంధించిన నేర చరిత్ర వివరాలను, ఇతర సమాచారాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పోలింగ్ తేదీలోగా మూడుసార్లు ప్రచురించాలని, మొదటి విడత మే 3లోపు, రెండో ప్రచురణ మే 4 నుంచి 7లోపు, మూడో విడత మే 8 నుంచి 11లోపు తప్పనిసరిగా ప్రచురించాలని కలెక్టర్ సూచించారు.

జనసేన శ్రేణుల చిందులు

నరసాపురం: పట్టణంలోని దర్గా సెంటర్‌లో జనసేన ప్రచార కార్యక్రమంలో ఇద్దరు జర్నలిస్టులపై ఆ పార్టీ నాయకులు అసభ్య పదజాలంతో దూషణలు దిగడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. సోమవారం డ్యాన్స్ మాస్టర్ శేఖర్ దర్గా సెంటర్‌లో జనసేన తరపున ప్రచార కార్యక్రమానికి వచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంలో కవరేజీకి వెళ్లిన ఓ పత్రిక విలేకరి, మరో న్యూస్ చానల్ జర్నలిస్ట్‌పై అక్కడున్న జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ కెమెరామెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫొటోలకు అడ్డువస్తున్నారు, మీరు ఎవరు? అంటూ రుసరుసలాడాడు. తాము జర్నలిస్టులమని చెప్పబోతుండగా.. జర్నలిస్టులైతే ఐడీ కార్డులు వేసుకుని తిరగాలని గర్జించారు. 'నేనెవరు అనుకుంటున్నావు.. నాయకర్ కెమెరామెన్‌ని, కాబోయే మంత్రి మనిషిని' అంటూ శివాలెత్తారు. ఇప్పటికే నాయకర్ వ్యవహార తీరుపై నియోజకవర్గంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా నాయకర్ అనుయాయుల దురుసు ప్రవర్తనతో ముందుకు వెళుతున్నారు. జనసేన తీరుపై జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి.

ఐఆర్‌సీటీసీ అయోధ్య యాత్ర

ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో అయోధ్య–ముక్తినాథ్ (నేపాల్) చార్టర్ కోచ్ యాత్రని వచ్చేనెల 6న ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 6న యాత్ర ప్రారంభమై 18న సాయంత్రానికి పూర్తి అవుతుందని పేర్కొన్నారు. 12 రాత్రులు, 13 రోజులు ఈ యాత్రలో అయోధ్య, ఖాట్మాండు, ముక్తినాథ్, పోఖారా ప్రాంతాలను సందర్శించవచ్చని తెలిపారు. యాత్ర 6న రామనాథపురం నుంచి ప్రారంభమై గూడూరు, విజయవాడ మీదుగా సాగుతుందన్నారు. ఒక టికెట్ రూ.72,500, ఇద్దరు కలిసి వస్తే ఒక్కో టికెట్‌కు రూ.57,600, ముగ్గురు కలిసి వస్తే ఒక్కో టికెట్‌కు రూ.56,500 చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎల్టీసీ సౌకర్యం ఉందన్నారు. మరిన్ని వివరాలకు విజయవాడ రైల్వే స్టేషన్‌లోని ఐఆర్‌సీటీసీ కార్యాలయం లేదా ప్రవీణ్ సెల్ 92814 95848, బాలాజీ సెల్ 82879 32312లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

నేలబావిలో మహిళ మృతదేహం

గోపవరం (ముసునూరు): గోపవరంలో నేల బావిలో అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతదేహం కనిపించడంతో గ్రామంలో తీవ్ర కలకలం రేగింది. ఏఎస్సై నాగఫణిభూషణ రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఓ తోటలో నేల బావిలో మహిళ మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. బావి గట్టున చెప్పులు ఉండగా, మృతదేహం బావిలో బోర్లగా పడి ఉండడంతో మృతురాలి ఆచూకీపై కొంతసేపు ఉత్కంఠ నెలకొంది. ముసునూరు పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్సై ఆధ్వర్యంలో మృతదేహాన్ని సాయంత్రానికి బావి నుంచి బయటకు తీయించారు. మృతదేహాన్ని గ్రామానికే చెందిన షేక్ హుస్సేన్‌బీ (54)గా స్థానికులు గుర్తించారు. దీర్ఘకాలిక అనారోగ్యం కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు

యువకుడి మృతి, ముగ్గురికి గాయాలు

దెందులూరు: సోమవరప్పాడు వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఎస్సై కే.స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు కొత్తపేటకు చెందిన పి.జగదీష్, పావుపూరి శివ ఏలూరు నుంచి బైక్‌పై ఆదివారం రాత్రి వేగవరం వెళుతున్నారు. సోమవరప్పాడు వద్దకు వచ్చేసరికి మరో బైక్‌పై వస్తున్న ఆడమిల్లికి చెందిన బాజీ ఇమామ్, రత్నకుమారి ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో జగదీష్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కలల వారధి త్వరలో సాకారం

- నరసాపురం వశిష్ట వంతెన టెండర్లు జూన్‌లో ఓపెన్
- టెండర్లు ఖరారు కాగానే ప్రారంభం కానున్న పనులు
- నిర్ణీత కాల వ్యవధిలో నిర్మాణం పూర్తికి నిర్ణయం
- రూ.591.71 కోట్లతో రాజుల్లంక వద్ద బ్రిడ్జి నిర్మాణం
- మరో రూ.60 కోట్ల వ్యయంతో స్థల సేకరణ పూర్తి

వశిష్ట గోదావరిపై నరసాపురంలో వంతెన నిర్మాణ కల త్వరలో సాకారం కానుంది. ఇప్పటికే వంతెన పనులకు టెండర్లు పిలిచారు. వచ్చిన టెండర్లను జూన్‌లో తెరవనున్నారు. టెండర్లు ఖరారు కాగానే పనులు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా ఈ అంశంపై దృష్టి పెట్టడం, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేయడంతో వంతెన నిర్మాణానికి అడుగు ముందడుగు పడింది. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ద్వారా రూ.591.71 కోట్ల నిధులతో వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. న్యూఢిల్లీలోని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో బిడ్స్ ఓపెన్ చేసి పనులు ఖరారు చేస్తారు. అంతేకాకుండా నిర్ణీత కాల వ్యవధిలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోనున్నారు.




నరసాపురం వశిష్ట రేవులో పంటుపై రాకపోకలు , సఖినేటిపల్లిలో వైఎస్సార్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం

నరసాపురం : ఉభయగోదావరి జిల్లాలను కలుపుతూ ప్రస్తుతం అటు కోనసీమ, ఇటు పశ్చిమగోదావరి జిల్లాల మధ్య వశిష్ట గోదావరిపై నరసాపురంలో వంతెన నిర్మించాలనేది దశాబ్దాల డిమాండ్. బ్రిటీష్ హయాంలో అంకురార్పణ జరిగిన ఈ వంతెన నిర్మాణం దశాబ్దాలుగా కలగానే మిగిలిపోయింది.

దశాబ్దాల డిమాండ్

వశిష్ట వారధి నిర్మాణానికి రూ.590 కోట్లు, స్థల సేకరణకు రూ.60 కోట్లు మొత్తంగా రూ.650 కోట్లు ఖర్చు చేస్తున్నారు. స్థల సేకరణ పూర్తి ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించింది. ఇదిలా ఉంటే వంతెన పనులు ముందుకు వెళ్లకుండా ప్రతిపక్ష పార్టీలు పలుమార్లు కోర్టులకు వెళ్లాయి. దీంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి.

కేంద్రం సహకారంతో..

రూ.591.71 కోట్ల అంచనాతో నరసాపురం మండలం రాజుల్లంక గ్రామం వద్ద వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. కోనసీమ జిల్లా చించినాడ మీదుగా నరసాపురం నుంచి ఒంగోలు వరకు నిర్మించిన 216 జాతీయ రహదారికి బైపాస్ నిర్మించడం ద్వారా వంతెన నిర్మాణం చేయించాలని ఆలోచన చేశారు. కోనసీమ జిల్లా శివకోడు నుంచి టేకిశెట్టిపాలెం మీదుగా ఉన్న స్టేట్‌హైవేను జాతీయ రహదారిగా మార్పుచేసి రామేశ్వరం మీదుగా ఇటు పశ్చిమగోదావరి జిల్లాలోని రాజుల్లంక, వైఎస్ పాలెం, సీతారామపురం మీదుగా 216 జాతీయ రహదారికి బైపాస్ హైవే రోడ్డు నిర్మించనున్నారు. మధ్యలో కోనసీమ జిల్లా రామేశ్వరం, ఇటు నరసాపురం మండలం రాజుల్లంక వద్ద వశిష్ట గోదావరిపై వంతెన నిర్మాణం చేయాలని నిర్ణయించారు.

సీఎం వైఎస్ జగన్ లేఖతో..

చించినాడ 216 జాతీయ రహదారికి కోనసీమ జిల్లా నుంచి నరసాపురం వరకూ బైపాస్ నిర్మించి, మధ్యలో వంతెన నిర్మిస్తే ఈ ప్రాజెక్ట్‌కు మోక్షం కలుగుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యమంత్రికి పలుమార్లు వివరించారు. బ్రిటీష్ హయాం నుంచి వంతెన విషయంలో జరిగిన మలుపులు, వంతెన నిర్మించడం వల్ల స్థానికంగా జరిగే ఓఎన్‌జీసీ కార్యకలాపాలు, మత్స్య, కొబ్బరి ఎగుమతుల వృద్ధి, తీరప్రాంతం అభివృద్ధి వంటి కీలక ప్రయోజనాలను సీఎం వద్ద ప్రస్తావించారు. దీంతో సీఎం వైఎస్ జగన్ కేంద్ర మంత్రి నితిన్‌గట్కరీకి లేఖ రాయడం, శివకోడు సఖినేటిపల్లి మీదుగా రామేశ్వరం నుంచి నరసాపురం వరకూ 25 కిలోమీటర్ల మేర స్టేట్ హైవేను 216కు బైపాస్‌గా నేషనల్ హైవేగా మార్చు చేయాలని, మధ్యలో రాజుల్లంకవద్ద గోదావరిపై వంతెన నిర్మించాలని లేఖలో కోరారు. సీఎం జగన్ లేఖకు స్పందించిన గట్కరీ వెంటనే ఆమోదం చెప్పడంతో దశాబ్దాల వంతెన సమస్యకు లైన్ క్లియర్ అయ్యింది. మొత్తం 380 మీటర్ల మేర వంతెన నిర్మాణానికి అంచనాలు తయారు చేశారు. స్థల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రూ.60 కోట్లు మంజూరు చేయడం, స్థల సేకరణ పూర్తి చేయడం జరిగాయి.

జగన్ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని..

ఈ ఏడాది వశిష్ట వంతెన పనులు మొదలు కాబోతున్నాయని తెలియగానే ప్రభుత్వానికి పేరు ఎక్కడ వస్తుందోనని ప్రతిపక్షాలు కుట్రలు మొదలుపెట్టాయి. స్థల సేకరణ అంశంలో కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారు. అయితే చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు గట్టి ప్రయత్నం చేసి స్టేను వెకేట్ చేయించి, ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించాలని నిర్ణయించారు. తీరా ముఖ్యమంత్రి 2022 నవంబర్ 21వ తేదీన నరసాపురం పర్యటన దగ్గరికి వచ్చే సమయానికి మళ్లీ రెండోసారి కోర్టు నుంచి స్టే తీసుకొచ్చారు. పదేపదే అడ్డంకులు కల్పించినా రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరమైన చిక్కులు లేకుండా చూసుకుని వంతెన పనులను టెండర్ల దశకు తీసుకొచ్చింది. లేదంటే వశిష్ట వంతెన పనులు ఇప్పటికే మొదలయ్యేవి.

మహానేత వైఎస్సార్ ఉండి ఉంటే..

ఎన్టీఆర్ తరువాత నరసాపురం వశిష్ట వంతెనకు బీజం వేసింది మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి. వైఎస్ 2008 ఏప్రిల్ 16న తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లిలో వశిష్ట వంతెనకు శంకుస్థాపన చేశారు. వెంటనే టెండర్లు పలిచి రూ.194 కోట్లతో పనులు సత్యం కంపెనీకి చెందిన నిర్మాణ సంస్థ మైథాస్‌కు అప్పటించారు. సర్వే పూర్తయి పనులు ప్రారంభం అయ్యే సమయానికి సత్యం సంస్థ సంక్షోభంలో చిక్కుకుని పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ పనులను వైఎస్సార్ వేరే కంపెనీకి అప్పగించారు. దీంతో మళ్లీ ఈ అంశం కోర్టుకెక్కింది. 2014 నుంచి అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కోర్టులో స్టే వెకేట్ చేయించే ప్రయత్నం కూడా చేయకుండా, వంతెన కట్టేస్తున్నామంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేసింది.

జగన్ ప్రభుత్వంలోనే వశిష్ట వంతెన నిర్మిస్తాం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కచ్చితంగా వశిష్ట వారధి కట్టి తీరుతుంది. ఈపాటికే పనులు ప్రారంభమయ్యేవి. కానీ ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టించాయి. కోర్టులకు వెళ్లాయి. ఏదీ ఏమైనా వశిష్ట వంతెన గోదావరి జిల్లాల ప్రజల చిరకాల కోరిక. స్థల సేకరరణ కూడా పూర్తయ్యింది. భూమి తీసుకున్న రైతులకు చెల్లింపులు జరిగిపోయాయి. టెండర్ల దశకు పనులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే నిర్ణీత కాల వ్యవధిలో వశిష్ట వంతెన నిర్మాణం జరుగుతుంది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

మూగజీవాల మృతిపై పశువైద్యుల ఆరా

- కబేళాకు కళేబరాలను తరలించడంతో వెలుగులోకి రాని కారణాలు
- దాణా, నీటి నమూనాలు సేకరించిన పశువైద్య అధికారులు



అస్వస్థతకు గురైన ఆవు పెయ్యికి వైద్య పరీక్ష చేస్తున్న పశువైద్యాధికారి భీమేశ్వరరావు

జంగారెడ్డిగూడెం రూరల్: కట్టవ పాదలవారిగూడెంలో మూగజీవాల మృతిపై పశువైద్యులు సోమవారం పరీక్షలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి మూగజీవాలు అస్వస్థతకు గురై కొన్ని మృతి చెందాయంటూ రైతు మేడిని బాబురావు ఫిర్యాదు మేరకు పశు వైద్యులు భీమేశ్వర రావు సోమవారం ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అస్వస్థతకు గురై ఇబ్బందులు పడుతున్న కొన్ని మూగజీవాలకు భీమేశ్వరరావు, సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. అలాగే 9 గేదెలు, 2 ఆవు పెయ్యిలు, 1 దున్నపోతు అస్వస్థతకు గురై మృతి చెందాయని రైతు బాబురావు తమ దృష్టికి తీసుకువచ్చారని, అయితే తాము ఘటనా ప్రాంతానికి వెళ్లే సరికి అక్కడ మూగజీవాల కళేబరాలు లేవని, వాటిని కబేళాకి తరలించేశారన్నారు. దీంతో పరీక్షలు చేసే వీలు లేక మృతికి గల కారణాలు నిర్ధారణ కాలేదన్నారు. అయితే మూగజీవాలు తిన్న దాణా, నీటి నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కి పంపినట్లు భీమేశ్వరరావు చెప్పారు. మృతి చెందిన మూగ జీవాల్లో మూడు పాలిచ్చే గేదెలు, 3 సూడి గేదెలు ఉన్నాయని రైతు తెలిపినట్లు భీమేశ్వరరావు తెలిపారు. ల్యాబ్ పరీక్షల అనంతరం మృతికి కారణాలు తెలుస్తాయన్నారు. పురుగు మందు పిచికారీ చేసిన మొక్కజొన్న జాడు తిని మృతి చెంది ఉంటాయని రైతులు అనుమానం వ్యక్తం చేయడంతో ఆ కోణంలో కూడా పరీక్షలు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీలో వలసల జోరు



నూజివీడులో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ సమక్షంలో చేరిన టీడీపీ కార్యకర్తలు



చంటినాయన సమక్షంలో చేరిన కంద్రిక గొల్లగూడెం కుటుంబాలు



మంకొల్లులో ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు సమక్షంలో చేరిన టీడీపీ కార్యకర్తలు



చంటినాయన సమక్షంలో చేరిన నూజివీడు జనసేన కార్యకర్తలు



కంఠమనేనివారిగూడెంలో గోపాల్ యాదవ్ సమక్షంలో పార్టీలో చేరిన గుంటుపల్లి టీడీపీ, జనసేన నేతలు

నూజివీడు: చంద్రబాబు చెప్పేవన్నీ మోసపూరిత హామీలేనని, అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను వంచించడంతో చంద్రబాబు దిట్టని వైఎస్సార్ సీపీ నూజివీడు అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన 70 మంది టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో సోమవారం చేరారు. వీరందరికి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ చంద్రబాబు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం గతంలో చూశామన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని ఓడించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ప్రజలు ఆలోచించి మంచి చేసిన వైఎస్ జగన్‌కు ఓట్లేసి రెండోసారి సీఎంను చేసుకోవాలన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, నాయకులు బసవా వినయ్, తలారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముద్దరబోయిన గ్రూపు నుంచి 50 కుటుంబాల చేరిక

నూజివీడు మండలం మీర్జాపురం శివారు కంద్రిక గొల్లగూడెంలోని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు గ్రూపునకు చెందిన 50 కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తనయుడు చంటినాయన సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికి చంటినాయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గొర్లబాబూరావు, పల్లపోతు శ్రీనివాసరావు, పుట్టి రాంబాబు, పైడి చిన్నారావు, పిన్నిబోయిన నాగేంద్రరావు, బొమ్మనబోయిన వెంకట రంగారావు, పుట్టి సత్యన్నారాయణలతో పాటు మరో 43 కుటుంబాలు పార్టీలో చేరాయి. చంటినాయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ల విజయానికి విజయానికి కృషి చేయాలన్నారు. నాయకులు జోగి ప్రభాకర్, అంగడాల ఆంజనేయులు, పూషదపు శ్రీనివాసరావు, పైడి జగ్గారావు పాల్గొన్నారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి..

నూజివీడుకు చెందిన జనసేన కార్యకర్తలు షేక్ ఇమ్రాన్, సయ్యద్ అఖిల్, దురంగుల రాము, షేక్ సుభానీ, షేక్ ఇబ్రహీంలు మేకా ప్రతాప్ తనయుడు చంటినాయన సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు.

మంకొల్లులో..

చాట్రాయి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. సోమవారం మంకొల్లులో 20 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సా సీపీలోకి చేరారు. పేరం బసవయ్య, సాగిరాజు సీతారామరాజు, సర్వేశ్వరావు, పేరబోయిన సత్యనారాయణ, గుంట్రు శ్రీనివాసరావు, అడ్డాద సర్వేశ్వరావు, పెద్దగాడ అప్పారావు, నందిపాం వెంకటేశ్వరావు, గొల్ల వెంకన్న, నందిపాం రవి, పేబోయిన శోభనాద్రి, గుంట్రు పేరయ్య, పాలకొల్లు రామారావు, పేరబోయిన శివరాజు, కొప్పుల సురేష్, కొప్పుల హరీష్‌లకు పార్టీ కండువాల కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మండల పార్టీ నాయకులు చెలికాని బాబ్జీ, కారంగుల వాసు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో..

కామవరపుకోట : బీసీల అభివృద్ధికి వారి సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని చింతలపూడి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరుముచ్చు గోపాల్ యాదవ్ అన్నారు. కంఠమనేనివారిగూడెంలో గోరుముచ్చు గోపాల్ యాదవ్ నివాసంలో ఆయన సమక్షంలో సోమవారం గుంటుపల్లి గ్రామం నుంచి టీడీపీ, జనసేన పార్టీకి చెందిన 20 కుటుంబాల వారికి కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జగన్ పరిపాలన నచ్చి, ఆయన ఇచ్చిన మేనిఫెస్టో మరింత ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. మందలపు కృష్ణారావు, మోరంపూడి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

200 మంది ముస్లిం యువత చేరిక



కైకలూరులో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన ముస్లిం యువతకు పార్టీ కండవాలు కప్పుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్

కై కలూరు: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అభిమానంతో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కై కలూరులోని పార్టీ కార్యాలయం వద్ద సోమవారం టీడీపీకి చెందిన 200 మంది ముస్లిం యువత పార్టీలో చేరారు. వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, రాష్ట్ర, జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ నాయకులు అబ్దుల్ హమీద్, షేక్ రఫీ ఆధ్వర్యంలో వీరంతా పార్టీలోకి చేరగా, వారికి నాయకులు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని ముస్లిం యువత చెప్పారు. అలాగే కైకలూరులో జరిగిన ఆత్మీయ సమావేశంలో మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం టీడీపీ గ్రామ అధ్యక్షుడు పెనుగొండ అశోక్‌కుమార్ టీడీపీ సభ్యత్వాన్ని రద్దు చేసుకుని గ్రామ సర్పంచ్ బోనం శేషగిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.